జెట్టీ నిర్మాణం జరిగేనా..?!

- నెరవేరని మత్స్యకారుల కల
- లంగర్ వేసేందుకు ఇబ్బందులు



జెట్టీ లేకపోవటంతో ఈపూరుపాలెం డ్రెన్‌లోనే లంగర్ వేసుకున్న పడవలు

బాపట్ల : సముద్రంలో వేట సాగించిన తరువాత పడవలను లంగర్ వేసుకునేందుకు జెట్టీ నిర్మాణం ఇప్పట్లో నెరవేరేలా కనిపించటం లేదు. చెన్నై నుంచి నిపుణుల బృందం దాన్వాయ్‌పేట, కృపానగర్ మధ్యలో స్థలాన్ని పలుమార్లు పరిశీలించి జెట్టీ నిర్మాణానికి అనుకూలమైనదిగా ప్రతిపాదించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. జెట్టీ లేకపోవటంతో వేటకు వెళ్లి వచ్చిన తరువాత పడవలు నిలుపుకునేందుకు రెండు, మూడు కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

నియోజకవర్గంలో పరిస్థితి ఇది

బాపట్ల నియోజకవర్గంలో సూర్యలంక, రామానగర్, ముత్తాయిపాలెం, విజయలక్ష్మి, దాన్వాయ్‌పేట, కృపానగర్, అడవిపల్లిపాలెం, రామచంద్రపురం, తుమ్మలపాలెం ప్రాంతాలకు చెందిన వారి వద్ద 250 పడవలు వరకు ఉన్నాయి. వీటిపై రెండు వేల కుటుంబాల వరకు ఆధారపడి జీవిస్తుంటారు. సూర్యలంక, రామానగర్, ముత్తాయిపాలెంకు చెందిన మత్స్యకారులు సముద్రంలో వేట సాగించి సముద్రం వద్ద ఉన్న పొరుగులో నుంచి వెదుళ్ళపల్లి డ్రెన్‌లోకి పడవలను తెచ్చిపెట్టుకుంటారు. సుమారు రాకపోకలకు అదనంగా ఐదు కిలోమీటర్లు మేర ఆయిల్ వృధా ఖర్చుగా మారింది. అదేవిధంగా దాన్వాయ్‌పేట, కృపానగర్, అడవిపల్లిపాలెం, రామచంద్రపురానికి చెందిన మత్స్యకారులు వేట పూర్తి చేసుకున్న తరువాత ఈపూరుపాలెం డ్రెన్‌లో పడవలను తెచ్చిపెట్టుకుంటున్నారు. ఈ విధంగా డ్రెన్‌లో పడవలు పెట్టుకోవటం వలన తుపాన్లు వచ్చినప్పుడు ఆటుపోటులకు అవి తీవ్రంగా దెబ్బతింటున్నాయి. అదే జెట్టీ నిర్మాణం జరిగితే పడవలకు రక్షణగా ఉంటుందని మత్స్యకారులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ప్రభుత్వం వద్ద ప్రతిపాదనలు

జెట్టీ నిర్మాణానికి దాన్వాయ్‌పేట, కృపానగర్ సమీపంలో సముద్రంపై అనుకూల ప్రదేశమని ఎంపెడా నిర్ణయించింది. ఈ మేరకు చెన్నై నుంచి కూడా అధికారుల బృందం రెండేళ్ల క్రితం పరిశీలించింది. ప్రాజెక్టుకు సంబంధించి ప్రతిపాదనలు కూడా పంపాం. ప్రభుత్వం నుంచి అనుమతి రావాల్సి ఉంది.

-కృష్ణకిషోర్, ఎఫ్‌డీవో, బాపట్ల

కూటమి ప్రభుత్వం పట్టించుకోవటం లేదు



జెట్టీ నిర్మాణానికి దాన్వాయ్‌పేట, కృపానగర్ సమీపంలో సముద్రంపై అనుకూల ప్రదేశమని ఎంపెడా నిర్ణయించింది. ఈ మేరకు చెన్నై నుంచి కూడా అధికారుల బృందం గతంలో పరిశీలించింది. ప్రాజెక్టుకు సంబంధించి ప్రతిపాదనలు కూడా పంపారు. గత ప్రభుత్వం జెట్టీ నిర్మాణానికి కృషి చేసింది. తాజాగా కూటమి ప్రభుత్వం పట్టించుకోవటం లేదు.

- కొక్కిలిగడ్డ చెంచయ్య, మత్స్యకార కార్పొరేషన్ మాజీ డైరెక్టర్

క్లుప్తంగా

నేడు తిరునాళ్ల నిర్వహణపై సమావేశం

రేపల్లె రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని అరవపల్లి బాలకోటేశ్వరస్వామి తిరునాళ్ల నిర్వహణపై ఆలయ ఆవరణలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వహణ అధికారి దీవి వెంకట అప్పలాచార్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగే సమావేశంలో తిరునాళ్ల ఏర్పాట్లు, శాంతి భద్రతలు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై సమీక్షించబడునన్నారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

ఉచితంగా ఇంజినీరింగ్

బాపట్ల: బ్రాహ్మణ కమ్యూనిటీలో 12వ తరగతి పరీక్షల్లో (ఎంపీసీ)లో 85 శాతం మార్కులు సాధించిన విద్యార్థులను ఉచితంగా ఇంజినీరింగ్‌లో చేర్చుకుంటారని పాండిచ్చేరి యూనివర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ (రిటైర్డు) దేవనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉచితంగా ఇంజినీరింగ్ చేసే అవకాశాన్ని అందించేందుకు పాండిచ్చేరిలోని అరియార్ వెంకటేశ్వర కళాశాల సిద్ధంగా ఉందని తెలిపారు. వివరాలకు 7010553544 నెంబరును సంప్రదించాలని కోరారు.

పేదలకు దుస్తులు పంపిణీ



అమర్తలూరు(వేమూరు): ప్రతి ఒక్కరూ పేదలను ఆదుకోవాలని కమల్‌నాథ్ అన్నారు. అమర్తలూరు మండలంలోని ఇంటూరు గ్రామంలో పేదలకు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. గ్రామంలోని వైద్యులు డాక్టర్ కొరటాల సురేంద్ర నాథ్, డాక్టర్ బెనర్జీ, డాక్టర్ కొరటల రాజేంద్ర ప్రసాద్ సహకారంతో 1000 మంది వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.కన్నయ్య, నరేంద్రబాబు, కె.రవి, ఎస్.కోటి తదితరులు పాల్గొన్నారు.

వెంకట్రామయ్యను పరామర్శించిన డాక్టర్ గణేష్



నగరం: మండలంలోని పెదపల్లి గొల్లపాలెంకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బెల్లంకొండ పోలేరు వెంకట్రామయ్యను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ పరామర్శించారు. వెంకట్రామయ్యకు గత కొన్ని రోజులు నుంచి ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఇంటి వద్దనే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో డాక్టర్ గణేష్ వెంట్రామయ్యను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నగరం, చెరుకుపల్లి మండల కన్వీనర్‌లు ఇంకోల్లు రామకృష్ణ, దుండి వెంకట్రామిరెడ్డి, నగరం ఎంపీటీసీ ఉప్పాల వెంకటేశ్వరావు, నాయకులు ఉన్నారు.

రామసాయి జ్ఞానమందిర వార్షికోత్సవాలు



తెనాలిటౌన్: కొలకలూరు గ్రామంలోని రామసాయి జ్ఞాన మందిరం వార్షికోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం స్వామికి రాజ్యలక్ష్మి భజన సమాజం ఆధ్వర్యంలో విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించారు. అనంతరం బాబాకు 108 కలశాలతో కలశాభిషేకం చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని బాబాకు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీరామసాయి ట్రస్ట్- శ్రీరామసాయి జ్ఞాన మందిరం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అన్నదాతను ఆదుకోవాలి

లక్ష్మీపురం: రాష్ట్రంలో రైతుల పరిస్థితి రోజు రోజుకీ దారుణంగా ఉందని, అన్నదాతను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ అన్నారు. కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నేడు ఉందన్నారు. రైతుల గోడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టడం లేదని విమర్శించారు. పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుపరచకుండా వ్యవహరిస్తున్న తీరు రైతులకు శాపంగా మారిందని తెలిపారు. వ్యవసాయం చేయాలంటేనే రైతులు భయపడుతున్నారన్నారు. ఇవాళ మిర్చి రైతుల గోడు తీవ్రస్థాయిలో ఉందని, ధాన్యం, పత్తి రైతులు గిట్టుబాటు ధరలు లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుల సమస్యల్ని పరిష్కరించాలని ఆయన కోరారు.

త్యాగరాజు ఆరాధన ఉత్సవాలు



త్యాగరాజు కీర్తనల గానం

తెనాలి: పట్టణానికి చెందిన సంగీత సంస్థ శ్రీశారద సంగీతాలయం ఆధ్వర్యంలో సంగీత విద్వాంసుడు గౌరావఝుల ఆంజనేయశాస్త్రి శిష్య బృందంచే ఆదివారం త్యాగరాజు ఆరాధన ఉత్సవాలను ఘనంగా జరిపారు. తొలుత పట్టణ రామలింగేశ్వరపేట భాగవతులవారి వీధి నుండి రామనామం సంకీర్తనతో ఊరేగింపుగా బయలుదేరి, పుట్టారాఘవయ్య రైస్ మిల్లు దగ్గర్లోని శ్రీసీతాసమేత కోదండ రామాలయానికి చేరుకున్నారు. అక్కడ స్వామివారి ఎదుట, ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12:30 వరకు త్యాగరాజు వారి పంచరత్న కీర్తనలు, ఉపచార కీర్తనలును ఆలపించారు. వీటిలో 'జగదానంద తారక', 'దుడుకుగల', 'సాధించేనే మనసా', 'ఎందరో మహానుభావులు','గంధము పూయరుగా' వంటి కీర్తనలు ఉన్నాయి. సంగీత గురువు గౌరావఝుల ఆంజనేయశాస్త్రి, లక్ష్మీసౌజన్య, శ్రీకాంతి, అనూష, సుచరిత, శ్రీరామచంద్ర కార్తిక్ సంకీర్తన చేశారు. మృదంగంపై బి.సురేష్‌బాబు, వయొలిన్‌పై జి.శ్రీకృష్ణ అభిరామ్ వాయిద్య సహకారం అందించారు. వీరితో 50 మంది గాయకులు గళం కలిపారు. జి.బాల వెంకట నరసింహకుమార్, జి.శ్యామకృష్ణశర్మ పర్యవేక్షించారు. కొండపి శ్రీనివాసరావు, పొన్నపల్లి గోపాలకృష్ణమూర్తి, వీఎల్ నరసింహారావు, టీవీఎస్ శాస్త్రి పాల్గొన్నారు.

గణపతికి 16 రోజుల పండుగ



వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామంలో కొలువైన సిద్ధి బుద్ధి సమేత గణపతిస్వామి వార్ల రథ సప్తమి బ్రహ్మోత్సవాలు, కల్యాణ మహోత్సవాలలో భాగంగా ఆదివారం 16 రోజుల పండుగ, సంకట హర చతుర్థి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు పూజా కార్యక్రమాలను శాస్త్రయుక్తంగా జరిపారు. స్వామి వారి కల్యాణ మహోత్సవాలే వెల్లటూరు తిరునాళ్లగా ప్రసిద్ధి గాంచాయి. ప్రతి నెల పౌర్ణమి తరువాత వచ్చే చతుర్థిని పురస్కరించుకుని కూడా పూజలు జరిగాయి. సంకట హర చతుర్థి అంటే మనుషుల కష్టాల నుంచి గట్టెక్కించేది అని.. విఘ్నాలు తొలగించే గణపతికి అత్యంత ప్రీతి పాత్రమైన ప్రధానమైనదని వేద బ్రాహ్మణులు క్రోవి శ్రీరామచంద్రమూర్తి, తురమెల్ల సాయిబాబు తెలిపారు. తీర్థ ప్రసాదాలు, కుడుములు, ఉండ్రాళ్లు అందించారు. భక్తులు స్వామి వార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రైతుల ఆత్మహత్యల నివారణలో ప్రభుత్వం విఫలం

గుంటూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఆత్మహత్యలను నివారించడంలో పూర్తిగా విఫలమైందని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం నేతలు ధ్వజమెత్తారు. ఆదివారం ప్రత్తిపాడు మండలం వంగిపురంలో శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడిన రైతు వరగాని బాబూరావు కుటుంబాన్ని సంఘం నేతలు పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తొమ్మిది నెలల కూటమి ప్రభుత్వంలో రైతన్నల పరిస్థితి దారుణంగా, దయనీయంగా మారిందని విమర్శించారు. వరదలు, భారీ వర్షాలు, కరువు పరిస్థితులు వల్ల దెబ్బతిన్న పంటలకు పరిహారం నేటికీ అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులతో మనస్తాపం చెంది రైతులు ఆత్మహత్య చేసుకుంటుండగా, వ్యక్తిగత కారణాలతో చేసుకుంటున్నారని తప్పుడు నివేదికలు ఇవ్వడం మరింత సిగ్గుచేటని ఖండించారు. బాబూరావు పంటలకు మద్దతు ధరలు దక్కక, అప్పులు తీర్చే మార్గం లేక తీవ్రంగా మనస్తాపానికి చెంది ఆత్మహత్య చేసుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కుటుంబానికి రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. సాగు కోసం చేసిన అప్పులన్నిటిని మాఫీ చేయాలని, ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల దగ్గర సేద్యం కోసం తీసుకున్న అప్పులను రాష్ట్ర ప్రభుత్వం తీర్చాలని డిమాండ్ చేశారు. కుటుంబానికి ఇళ్ల స్థలం ఇవ్వాలని, బాధిత రైతు భార్యకు వితంతు పింఛను తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. జమలయ్య, గుంటూరు జిల్లా కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి పి.వి. జగన్నాథం, సీపీఐ పత్తిపాడు నియోజకవర్గ కార్యదర్శి రామిశెట్టి ఆదేశ్వరరావు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

నగరంపాలెం: శివరాత్రి పురస్కరించుకుని త్రైత సిద్ధాంతం- ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక గుంటూరు కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నాగరాజు కాలనీలో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాల ప్రచారం, శివరాత్రి పండుగపై ప్రచారం నిర్వహించారు. శివరాత్రి పండుగ విశిష్టతను తెలియజేసే పుస్తకాలు స్థానికులకు అందించారు. కార్యక్రమంలో గుంటూరు కమిటీ అధ్యక్షులు రౌతు శ్రీనివాసరావు, సభ్యులు బి.శివలింగంనాయక్, టి.బ్రహ్మం, పట్టాభి శ్రీను, జె.హరిబాబు, ఎ.అరుణ పాల్గొన్నారు.







— అలరిస్తున్న — మంచు సోయగాలు

మంచు సోయగాలు చూపరులను విశేషంగా అకట్టుకుంటున్నాయి. తెల్లవారుజాము సమయంలో ప్రకృతి అందాలు పులకిస్తున్నాయి. మంచు విపరీతంగా పడుతుండటంతో చెట్లు, గడ్డి మొక్కలపై పడిన మంచు బిందువులు ముత్యాలను తలపిస్తున్నాయి. చెట్టు కొమ్మలకు అల్లిన సాలెగూళ్లపై పడిన మంచు బిందువులు ముత్యాల హారాల్లా దర్శనమిస్తున్నాయి. మండల కేంద్రమైన నగరంలో పలు ప్రాంతాలలో కురిసిన మంచు ముత్యాలు పలువురిని విశేషంగా అలరించాయి.

– నగరం

ముగిసిన భాగవత ప్రవచనాలు



మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి దంపతులకు సత్కారం

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై గత ఆరు రోజులుగా సాహితీవేత్త పీఎస్ఆర్.ఆంజనేయప్రసాద్ జయంతిలో భాగంగా నిర్వహిస్తోన్న భాగవత రస వైభవం ప్రవచనాలు ఆదివారంతో ముగిశాయి. ప్రముఖ సాహితీవేత్త ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి ప్రవచనం చేశారు. రుక్మిణి అంటే జీవుడు, కృష్ణుడు అంటే దేవుడని పేర్కొన్నారు. దేవుడికి జీవుడికి అనుసంధానం అగ్ని అని, అందుకే కథలో రుక్మిణీదేవి అగ్నిద్యోతనుడు అనే బ్రాహ్మణుడి ద్వారా సందేశం పంపిందని వివరించారు. అనంతరం మంత్రాశ్రమ పీఠాధిపతి నరసింహానంద భారతీస్వామి భక్తులను ఉద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్. మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ నిర్వాహకులు బొల్లేపల్లి సత్యనారాయణ, సాహితీ సమాఖ్య కార్యదర్శి ఎస్.వి.ఎస్.లక్ష్మీనారాయణ, సాహితీవేత్త నారాయణం శేషుబాబు, పి.రవికిశోర్, పి.హైమానంద పాల్గొన్నారు. చివరగా మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి దంపతులను సత్కరించారు.

డాక్టరేట్ అందుకున్న స్టీవెన్‌పాల్‌కు సత్కారం



తెనాలిరూరల్ : ఇటీవల డాక్టరేట్ అందుకున్న దైవ సేవకులు కె. స్టీవెన్‌పాల్‌ను సంఘ సభ్యులు ఆదివారం సత్కరించారు. స్టీవెన్‌పాల్ గత 35 ఏళ్లుగా పాస్టర్‌గా సుదీర్ఘ సేవలందించారు. ఇటీవల నెల్లూరు జిల్లా కందుకూరులో బాప్టిస్ట్ మిషన్ ఆధ్వర్యంలో పలువురు దైవ సేవకులకు డాక్టరేట్ ప్రధానం చేశారు. దానిలో భాగంగా స్టీవెన్ పాల్ డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కొలకలూరు కరుణానిలయం బాప్టిస్ట్ చర్చ్ సభ్యులు స్టీవెన్‌పాల్ దంపతులను సత్కరించారు. సంఘ సభ్యులు కె.జార్జ్ థామస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పీబీ విజయకుమారి, ఎ. బ్యూలా ఇవాంజిలిన్, ఎం.చైతన్య, ఎస్. వినయ్ కుమార్, కె.కిరణ్మయి, ఎం.లక్ష్మీ కరుణకుమారి, ఎస్.సుజాత, ఎ.విజయ రాజేందర్, ఎం.హోలి పాల్గొన్నారు.

పొగమంచు కారణంగా రాకపోకలకు అంతరాయం



జాతీయ రహదారిని కప్పేసిన పొగమంచు

చెరుకుపల్లి: గత కొన్ని రోజులుగా ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గడంతో రోజు రోజుకు చలి తీవ్రత మరింత పెరుగుతుంది. ఉదయం 9 గంటల వరకు ఒక్కో రోజు 10 గంటల వరకు కూడా పొగమంచు వీడడం లేదు. వాహనదారులు లైట్లు వేసుకుని మరీ రాకపోకలు సాగిస్తున్నారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే బస్సులు పొగ మంచు కారణంగా సమయానికి చేరుకోలేక పోవడంతో తరగతులు మిస్ అవుతున్నామని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. ఇక సాయంత్రం ఐదు గంటలకే చలి పులి విజృంభిస్తోంది. దీంతో వృద్ధులు, చిన్నారులు, మహిళలు ఇళ్లకే పరిమితం అవుతున్నారు. ఇక ఉష్ణోగ్రతలు పడిపోవటంతో కొంత మంది అస్తమా, కోరింత దగ్గు, జలుబు, చర్మవ్యాధుల బారిన పడుతున్నారు. వాటి బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటూ ఆహార నియమాలు పాటించాలని అవసరం అయితే తప్ప మంచులో తిరగరాదని వైద్యులు సూచిస్తున్నారు. అంతే కాకుండా ఉదయం చలి తీవ్రతకు పొగమంచుకు ఆటో డ్రైవర్లు ఆటోలు నడపలేక చలిమంటలు వేసుకుని చలి కాచుకుంటున్నారు.



ఆటో స్టాండ్‌లో చలిమంటలు వేసుకుంటున్న ఆటో డ్రైవర్లు

జాగ్రత్తగా నడపాలి



పొగమంచు ఉన్న సమయంలో వాహనదారులు సిగ్నల్ లైట్లు వేసుకొని అతి వేగంగా నడపకుండా జాగ్రత్తగా రాకపోకలు సాగించాలి. వేగంగా వెళ్లి ప్రమాదాలు తెచ్చుకోవద్దు. జాతీయ రహదారిపై దూరం వెళ్లే భారీ వాహనాలు పొగమంచు తగ్గే వరకు రోడ్డు పక్కన ఆపుకుంటే మంచిది. పాఠశాలలకు వెళ్లే బస్సులు కూడా చిన్నారులను దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తగా నడపాలి.

టి.అనీల్ కుమార్, ఎస్సై, చెరుకుపల్లి

కాలువ ఇలా.. నీరు పారేదెలా..?



పంట కాలువల్లో గుర్రపు డెక్క ఉండటంతో నీరు పారుదల కావడం లేదని రైతులు వ్యక్తం చేశారు. అమర్తలూరు మండలంలోని కూచిపూడి నుంచి నిజాపట్నం వెళ్లు కాలువల్లో గుర్రపు డెక్క అల్లుకుపోయింది. ఇరిగేషన్ అధికారులు గుర్రపు డెక్క తొలగించేందుకు చర్యలు తీసుకోవడం లేదని రైతులు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నీటి సంఘాలు ఏర్పాటు చేసింది. నీటి సంఘాల అధ్యక్షులను ఎంపిక చేసింది. నీటి సంఘాల అధ్యక్షులు ఇరిగేషన్ కాల్వలోని గుర్రపు డెక్క తొలగించాలని రైతులు కోరుతున్నారు.

– అమర్తలూరు(వేమూరు)

ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయలు



పిల్లలకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ

ఈమని(దుగ్గిరాల): దుగ్గిరాల మండలంలోని ఈమని గ్రామంలో ఆదివారం విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు 554వ జయంతిని నిర్వహించారు. గ్రామ కాపుసంఘం ఆధ్వర్యంలో అక్కడి రామమందిరంలో ఏర్పాటైన సభకు కవి, రచయిత రంగిసెట్టి రమేష్ (గంగాశ్రీ) అధ్యక్షత వహించారు. విజయనగర సామ్రాజ్యాన్ని రాజుగా చిన్నవయసులోనే బాధ్యతలు స్వీకరించిన శ్రీకృష్ణదేవరాయలు గొప్ప పరిపాలనాదక్షుడిగా పేరుగాంచినట్టు గుర్తుచేశారు. రాయల పాలనలో విజయనగర సామ్రాజ్యం అత్యున్నత స్థితికి చేరుకుందని తెలిపారు. జనరంజకంగా పరిపాలన చేయటమే కాకుండా కవులు, కళాకారులను పోషించి 'ఆంధ్రభోజుడు'గా కీర్తిని పొందారనీ చెప్పారు. రాయలు కూడా కవిగా చెబుతూ సాహితీ సమరాంగణ సార్వభౌముడుగా ఖ్యాతిని వహించినట్టు వివరించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు ఎస్ఆర్‌కే రమేష్ మాట్లాడుతూ రాయలు జీవిత విశేషాలను తెలియజేశారు. రాయల ఆస్థానకవుల్లో ఒకరైన ప్రఖ్యాతిగాంచిన తెనాలి రామకృష్ణకవి తెనాలికి చెందినవారేనని గుర్తుచేశారు. విద్యార్థులు, నేటితరం యువతీయువకులు రాయల చరిత్రను తెలుసుకోవాలని అభిప్రాయపడ్డారు. కవి చందు సూర్యరాయల జీవితవిశేషాలతో కవితాగానం చేశారు. సభానంతరం పేదలకు నిత్యావసరాలు, కూరగాయలు, పిల్లలకు నోట్‌పుస్తకం, పెన్నులు, పెన్సిళ్లను బహూకరించారు. కుప్పాల శ్రీరామమూర్తి పర్యవేక్షించారు. అంబటి వెంకటేశ్వర్లు, యడ్ల సాయికృష్ణ, పసుపులేటి శ్రీనివాసరావు, పసుపులేటి శివకోటి, బొందలపాటి పూర్ణయ్య, మద్దిరాల రోశయ్య, చెన్నంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై దాడులు

గుంటూరు రూరల్: పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసిన సంఘటన వట్టిచెరుకూరు మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. గారపాడులో పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. 18 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ 1.30 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. రావిపాటి వారిపాలెంలో పేకాట స్థావరంపై దాడిచేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 750 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు.